ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

తమిళనాడు
TAMILNADU

శనివారం 13 జూలై 2024

హైకోర్టు సీజేగా జస్టిస్ కేఆర్ శ్రీరాం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మహదేవన్‌కు పదోన్నతి
- సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు



చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరాంను సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ప్రస్తుతం మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జస్టిస్ ఆర్.మహదేవన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని కూడా సిఫార్సు చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దానిని పరిశీలించి రాష్ట్రపతి ఆమోదానికి కేంద్రం పంపుతుంది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం సుప్రీం కొలీజియం సిఫార్సులు అమలులోకి వస్తాయి.

ముంబై నుంచే జీవితం...

ముంబైలో పుట్టిన పెరిగిన జస్టిస్ కేఆర్ శ్రీరాం బాంబే యూనివర్సిటీ నుంచి బీకాం, ఎల్ఎల్‌బీ చేశారు. లండన్‌లోని కింగ్స్ కాలేజీలో ఎల్ఎల్ఎం పట్టా పుచ్చుకున్నారు. 1986 జూలై 3వ తేదీ మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్‌లో తన పేరు నమోదు చేసుకున్నారు. 1997 నుంచి ముంబై హైకోర్టులో సొంతంగా ప్రాక్టీసు ప్రారంభించారు. ఇంటర్నేషనల్ ట్రేడ్ లా, కస్టమ్స్ యాక్ట్, మోటార్ వెహికల్స్ యాక్ట్, మెరైన్ ఇన్సూరెన్స్, కంపెనీ లా వ్యవహారాలకు సంబంధించిన కేసుల వాదనల్లో విశేషంగా ఖ్యాతి చెందారు. 2013 జూన్ 21వ తేదీ బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన.. 2016 మార్చి 2వ తేదీన శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి పలు కీలక కేసుల్లో తీర్పులు వెల్లడించారు.



మద్య నిషేధ చట్ట సవరణకు గవర్నర్ ఆమోదం

- సారా విక్రయించినా, తయారు చేసినా రూ.10 లక్షల జరిమానా

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ సారా విక్రయిస్తున్న వారికి యావజ్జీవ జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించేలా రూపొందించిన చట్ట సవరణ బిల్లుకు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1937 మద్యనిషేధ చట్టం అమలులో ఉంది. ఈ నేపథ్యంలో, ఇటీవల కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి 66 మంది మృత్యువాతపడిన విషయం తెలిసిందే. దీంతో, రాష్ట్రవ్యాప్తంగా కల్తీ సారా విక్రయాలను అరికట్టేలా ముమ్మర చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, సారా తయారుచేయడం, విక్రయించే వారిపై కఠిన చర్యలు చేపట్టేలా, తమిళనాడు మద్య నిషేధ చట్టంలో మార్పులు చేశారు. ఈ చట్ట సవరణ బిల్లును మంత్రి ఎస్.ముత్తుస్వామి గత నెల 29వ తేది శాసనసభలో ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. దీనిని వెంటనే గవర్నర్ ఆమోదానికి పంపించారు. ఈ బిల్లును గవర్నర్ ఆమోదించినట్లు శుక్రవారం ప్రకటన వెలువడింది. దీని ప్రకారం, ఈ సవరణ గెజిట్ చేయబడి, త్వరలో అమలుకు రానుందని అధికారులు తెలిపారు.

బస్సు చార్జీలు పెంచేదిలేదు

- మంత్రి శివశంకర్



పెరంబూర్, జూలై 12: ప్రభుత్వ బస్సు చార్జీలు పెంచే యోచన ప్రస్తుతం లేదని రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ స్పష్టం చేశారు. పెరంబలూరులో మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) కొత్తగా కొనుగోలు చేసిన బస్సుల్లో, ఆమ్నీ బస్సుల్లో ఉన్నట్లు సెల్‌ఫోన్ చార్జింగ్, పడక తదితరాలున్నాయన్నారు. రవాణా శాఖను ప్రైవేటుపరం చేయబోతున్నారంటూ డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆరోపణ చేయడం సరి కాదన్నారు. రవాణా శాఖ పనితీరు తెలియకుండా ఆమె మాట్లాడుతున్నారన్నారు. ఎస్ఈటీసీలో ప్రస్తుతం కొత్తగా 600 మంది నియమితులయ్యారని, 7,500 బస్సులు కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారన్నారు. ఉచిత ప్రయాణాలకు సంబంధించిన రవాణా శాఖకు ముఖ్యమంత్రి నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఆ ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వం రూ.2,500 కోట్లు రవాణా శాఖకు కేటాయించిందని తెలిపారు. అందువల్లే రవాణా శాఖ ఉద్యోగులు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు అందుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ బస్సుల్లో చార్జీల పెంపు ఇప్పట్లో ఉండదన్నారు. పొరుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన వెంటనే, బస్సు చార్జీలు పెంచుతున్నారని తెలిపారు. కానీ, రాష్ట్రంలో బస్సు చార్జీలు పెంచకుండా రవాణా సంస్థను నడపాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి వివరించారు.

శాంతిభద్రతల విఘాతానికి దుష్టశక్తుల కుట్ర

- ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు కుయుక్తులు
- సీఎంతో భేటీ అనంతరం డీపీఐ నేత తిరుమావళవన్

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతల విఘాతానికి దుష్టశక్తులు కుట్ర పన్నాయని, తద్వారా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు కుయుక్తులు పన్నుతున్నాయని డీపీఐ అధినేత, లోక్‌సభ సభ్యుడు తిరుమావళవన్ ఆరోపించారు. బహుజన సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ ఇటీవల హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే 11 మందిని అరెస్టు చేసిన పోలీసులు. దర్యాప్తు చేపడుతున్నారు. ఈ హత్యపై ప్రతిపక్షాలన్నీ తీవ్రంగా స్పందించాయి. ఈ హత్యకు నైతిక బాధ్యత వహించి స్టాలిన్ తన సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. ఇవేవీ పట్టించుకోని స్టాలిన్ వెళ్లి ఆర్మ్‌స్ట్రాంగ్ కుటుంబాన్ని పరామర్శించారు. అంతేగాక హంతకుల సంగతి తేల్చాల్సిందేనని పోలీసులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో తిరుమావళవన్ శుక్రవారం సచివాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి స్టాలిన్‌తో భేటీ అయ్యారు. అరగంట సమావేశం అనంతరం బయటకు వచ్చిన ఆయన.. మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అద్దెకు మనుషుల్ని తెచ్చుకుని సమావేశాలు నిర్వహిస్తున్న కొన్ని పార్టీలు.. అదే తమ బలమని భ్రమ పడుతున్నాయని ఎద్దేవా చేశారు. అలాంటివారికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందన్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యలో రాజకీయ కుట్ర వున్నట్లు అనుమానాలున్నాయని, ఈ హత్యకు సంబంధించి అనుమానితులందరినీ అరెస్టు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు దర్యాప్తుపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని అందరికంటే ముందుగా ఓ బీజేపీ నేత కోరారని, ఆరుద్ర గోల్డ్ కంపెనీ అక్రమాలతో సంబంధమున్న ఆ నేత డిమాండ్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో పోలీస్ శాఖను అప్రమత్తం చేసి, దోషుల్ని పట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధిపై నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ లేనిపోని విమర్శలు చేయడం ఆయన రాజకీయ అనైతికతకు పరాకాష్ఠ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



సీఎంతో తిరుమావళవన్

నాలుకను అదుపులో పెట్టుకోండి

సీమాన్‌కు మంత్రి గీతా జీవన్ హెచ్చరిక

దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న సీమాన్ నాలుకను అదుపులో పెట్టుకుంటే మంచిదని, లేనిపక్షంలో డీఎంకే కార్యకర్తల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని మంత్రి గీతా జీవన్ హెచ్చరించారు. శుక్రవారం ఆమె తూత్తుకుడిలో మీడియాతో మాట్లాడుతూ.. సీమాన్ మానసిక స్థితి సరిగ్గా లేదనే అనుమానం వ్యక్తం చేశారు. కరుణానిధి ఐదుసార్లు రాష్ట్రానికి సీఎంగా సేవలందించారని, ఆయన గురించి తప్పుగా మాట్లాడే అర్హత సీమాన్‌కు లేదన్నారు. పరిపక్వత కలిగిన నేత స్టాలిన్ మౌనం వల్ల డీఎంకే కార్యకర్తలు సంయమనం పాటిస్తున్నారని, లేనిపక్షంలో సీమాన్ పరిస్థితి ఏమవుతుందో గ్రహిస్తే మంచిదని హెచ్చరించారు. శ్రీలంక నేతల నుంచి డబ్బులు తెచ్చుకుని రాజకీయాలు నడుపుతున్న సీమాన్.. నీతులు చెప్పడం ఆపితే మంచిదని మంత్రి గీతా జీవన్ హితవు పలికారు.

విక్రవాండి విజేత ఎవరో?

- నేడు ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

ప్యారీస్, జూలై 12: విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల పోలింగ్‌లో నమోదైన ఓట్ల లెక్కింపు శనివారం జరుగనుంది. పటిష్టమైన భద్రత నడుమ ఈసీ నిబంధనల మేరకు ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు 20 రౌండ్లు జరుగుంది. ఉదయం 11 గంటలకే స్పష్టమైన ఫలితాలు వెలువడతాయని ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ నియోజకవర్గ డీఎంకే ఎమ్మెల్యేగా వ్యవహరించిన పుహళేంది అనారోగ్యంతో మృతిచెందిన కారణంగా ఈ నెల 10వ తేది ఉప ఎన్నిక జరిగిన విషయం తెలిసిందే. ఇండియా కూటమిలో డీఎంకే అభ్యర్థిగా అన్నియూర్ శివ, ఎన్డీఏ కూటమిలో పీఎంకే అభ్యర్థిగా సి.అన్బుమణి, నామ్ తమిళర్ కట్చి తరఫున అభినయ, ఇండిపెండెంట్లు సహా 29 మంది పోటీచేశారు. రాష్ట్ర అసెంబ్లీకి 2026వ సంవత్సరంలో జరుగనున్న ఎన్నికలకు విక్రవాండి ఉప ఎన్నిక ఫలితాలు కీలకంగా ఉంటాయని అన్ని రాజకీయ పార్టీలు చెబుతుండడంతో, రాష్ట్ర ప్రజలు ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



అన్నియూర్ శివ (డీఎంకే)

డా.అభినయ (నామ్ తమిళర్)

అన్బుమణి (పీఎంకే)

14 బల్లలు... 20 రౌండ్లలో లెక్కింపు..

విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైన ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. 20 రౌండ్లుగా జరుగనున్న లెక్కింపు కోసం 14 బల్లలు ఏర్పాటుచేశారు. రెండు బల్లల్లో పోస్టల్ ఓట్లు ఒక రౌండ్‌లో లెక్కిస్తారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ ఓట్లు లెక్కించిన అరగంట తరువాత ఈవీఎంల్లో పోలైన ఓట్లు లెక్కిస్తారు. కౌంటింగ్ ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది ఉదయం 5.30 గంటలకే వెళ్లి తనిఖీలు ముగించుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల కమిషన్ జారీచేసిన గుర్తింపుకార్డు కలిగిన ఏజెంట్లు, అభ్యర్థులను మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఫలితాలు పూర్తిగా వెల్లడయ్యే వరకు ఈ కేంద్రాలకు వెళ్లే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్ ఇతర ఎలక్ట్రానిక్ సాధనాలు తీసుకెళ్లడంపై నిషేధం విధించారు. కౌంటింగ్ కేంద్రం బయట పారా మిలిటరీ బలగాలు, తమిళనాడు ప్రత్యేక పోలీసు బలగాలు, స్థానిక పోలీసులు మొత్తం 150 మందికి పైగా బందోబస్తులో ఉన్నారు. కౌంటింగ్ ప్రక్రియను వీడియోలో రికార్డు చేయడంతో పాటు ఒక్కొక్క రౌండ్ వివరాలను రిటర్నింగ్ అధికారి వెల్లడించేందుకు కౌంటింగ్ కేంద్రంలో వసతులు ఏర్పాటుచేశారు.

ఆరోగ్య శాఖకు రూ.3,000 కోట్ల రుణం

- ప్రపంచ బ్యాంక్ అంగీకారం

పెరంబూర్, జూలై 12: రాష్ట్ర ఆరోగ్యశాఖలో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యత మెరుగు తదితరాలకు ప్రపంచ బ్యాంక్ రూ.3,000 కోట్ల ఆర్థికసాయం చేసేందుకు అంగీకరించింది. ప్రపంచ బ్యాంక్ సాయంతో రాష్ట్ర ఆరోగ్య శాఖ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. ఐదేళ్ల పథకంలో రూ.2,855 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఇందులో రూ.1,998.32 కోట్లు ప్రపంచ బ్యాంక్, రూ.856.42 కోట్లు రాష్ట్రప్రభుత్వం సమకూరుస్తున్నాయి. 2019 నుంచి ఇప్పటివరకు ప్రపంచ బ్యాంక్ నుంచి రూ.1,611 కోట్లు వచ్చాయి. అంటువ్యాధులు, ప్రమాద చికిత్స, ప్రసూతి, శిశు సంక్షేమ కార్యక్రమాలు, వైద్య మౌలిక సదుపాయాలు తదితర అవసరాలకు ఈ నిధులు వినియోగిస్తున్నారు. ఈ ఐదేళ్ల పథకం ముగియనున్న నేపథ్యంలో, నిధుల బకాయిలు రూ.376.44 కోట్లతో పాటు కొత్త నిర్మాణాలకు రూ.3,000 కోట్లు ఇవ్వాలని ప్రపంచ బ్యాంక్‌కు రాష్ట్రప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఇందు కోసం ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, ప్రభుత్వ అదనపు కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ, తమిళనాడు ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయ ఉపకులపతి నారాయణస్వామి తదితరులు అమెరికా వెళ్లారు. వాషింగ్టన్‌లోని ప్రపంచ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో, దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్‌తో బుధవారం మంత్రి, అధికారులు సమావేశమయ్యారు. ఈ విషయమై ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ... ప్రస్తుతం రూ.3,000 కోట్లు అందించేందుకు ప్రపంచ బ్యాంక్ అధికారులు ముందుకొచ్చారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్యశాఖ పనితీరు పరిశీలించిన అనంతరం, ఏ మేరకు నిధులివ్వాలనే విషయమై తుది నిర్ణయం తీసుకుంటారని వారు తెలిపారు.



వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంక్ అధికారులతో మంత్రి సుబ్రమణ్యం, ప్రభుత్వ అదనపు కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ తదితరులు

ఎన్నికలకు ముందస్తు సన్నాహాలు

- క్షేత్రస్థాయిలో సమైక్యంగా పనిచేయండి
- అన్నాడీఎంకే శ్రేణులకు ఈపీఎస్ పిలుపు



ఈపీఎస్ సమక్షంలో అన్నాడీఎంకేలో చేరిన వివిధ పార్టీల నేతలు

అడయార్, జూలై 12: మరో రెండేళ్లలో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించేందుకు వ్యూహ రచన చేశామని, ఆ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని పార్టీ శ్రేణులకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అన్నాడీఎంకే అన్ని చోట్లా చిత్తుగా ఓటమిపాలైన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఈ ఓటమిపై ఎడప్పాడి పార్టీ నేతలతో సమాలోచన జరుపుతూ, వారి అభిప్రాయాలు తీసుకుంటున్నారు. ఇందులోభాగంగా గడిచిన మూడు రోజులుగా రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈపీఎస్ కీలక సమావేశాలు జరుపుతున్నారు. తొలి రోజైన ఈ నెల 10వ తేదీ కాంచీపురం, శ్రీపెరుంబుదూరు లోక్‌సభ స్థానాలకు సంబంధించి చెన్నై నగర శివారు ప్రాంత పార్టీ జిల్లాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. రెండో రోజైన గురువారం శివగంగై, వేలూరు, తిరువణ్ణామలై, మూడో రోజైన శుక్రవారం అరక్కోణం, తంజావూరు లోక్‌సభ స్థానాలకు చెందిన నేతలతో సమావేశం నిర్వహించారు. హాజరైన అనేక మంది సార్వత్రిక ఎన్నికల్లో సరైన పొత్తు లేకపోవడంతో పాటు పార్టీ నేతలతో ఐక్యత లేపోవడమే ఓటమికి ప్రధాన కారణమన్నారు. అనంతరం ఎడప్పాడి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలను పార్టీ సీనియర్ నేతలతో ఒక సమీక్షా సమావేశం నిర్వహించి, ప్రతి ఒక్కరూ కలిసి పనిచేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికల కోసం బలమైన కూటమిని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో పొత్తు అంశాన్ని పార్టీ అధిష్టానానికి వదిలివేసి, క్షేత్రస్థాయిలో సమష్టిగా కలిసి పనిచేసే అంశంపై దృష్టిసారించాలని ఆయన కోరారు. కొన్ని జిల్లాల్లో పార్టీ నేతల మధ్య సమన్వయం కొరవడిందని, ఇలాంటివన్నీ సరిచేసుకుని, క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కలుపుకుని వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటినుంచే పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా వివిధ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు శుక్రవారం ఈపీఎస్ సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు.

అక్టోబరులో పాంబన్ వంతెనపై ట్రయల్ రన్



పాంబన్ వంతెనపై రైలింజన్‌తో ట్రయల్ రన్

ఐసిఎఫ్, జూలై 12: పాంబన్ కొత్త వంతెనపై అక్టోబరులో ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు రైల్వే బోర్డు అధికారులు తెలపారు. రామేశ్వరం సమీపంలోని పాంబన్ సముద్రంలో రూ.550 కోట్లతో కొత్త వంతెన నిర్మాణం, రామేశ్వరంలో రూ.120 కోట్లతో రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను రైల్వే బోర్డు సభ్యుడు అనీల్‌కుమార్ ఖండేల్‌వాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొత్త వంతెన నిర్మాణం రెండు నెలల్లో పూర్తవుతాయని, అక్టోబరులో ట్రయల్ రన్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం రామేశ్వరానికి రైళ్ల రవాణా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

సీబీఐ విచారణ కోరడం ఫ్యాషన్‌గా మారింది

- మంత్రి దురైమురుగన్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, జూలై 12: రాష్ట్రంలో ఏం జరిగినా, విషయం ఏదైనా సీబీఐ విచారణ కోరడం ఫాషన్‌గా మారిపోయిందని మంత్రి దురైమురుగన్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం వేలూరులో మీడియాతో మాట్లాడుతూ... కర్ణాటకలోని మూడు డ్యాంలు పూర్తిస్థాయిలో నిండాయని, అందువల్ల అదనపు జలాలను ఆ రాష్ట్ర ప్రభుత్వం తప్పక విడుదల చేయాల్సి ఉందని, రాష్ట్రానికి కావేరి జలాలు వస్తాయని తెలిపారు. రాజధాని నగరం చెన్నై పరిసరాల్లో కొత్తగా ఏడు జలవనరులు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో ఈ జలాశయాల నుంచి నగరానికి నీరు అందించనున్నామన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా హత్యలు జరుగుతున్నాయని, పాతకక్షల కారణంగా జరిగే హత్యలే అధికంగా ఉన్నాయన్నారు. కానీ, వాటి నేపథ్యమేమీ ఆలోచించకుండా ఘటన జరిగిన వెంటనే సీబీఐ విచారణ చేపట్టాలని కోరడం ప్రస్తుతం ఫ్యాషన్‌గా మారిపోయిందన్నారు. ఆన్‌లైన్ జూదం నిషేధిస్తూ చట్టం తీసుకొచ్చామని, కానీ, వారు మరో దారిలో నడుపుతున్నారని, ఇందుకు ఏం చేయాలని మంత్రి ప్రశ్నించారు. ఆగస్టు 15వ తేదీ లోగా అన్నాడీఎంకేలోకి పన్నీర్‌సెల్వం, శశికళను చేర్చేందుకు బీజేపీ తీవ్రంగా ఒత్తిడి చేస్తోందని, ఇందుకు ఈపీఎస్‌పై బెదిరింపులకు పాల్పడుతోందంటూ వస్తున్న వార్తలు ఉత్తుత్తివేనని దురైమురుగన్ వ్యాఖ్యానించారు.

సేర్కాడు కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

వేలూరు సమీపంలోని సేర్కాడులో రూ.12.46 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల భవనాన్ని మంత్రి దురైమురుగన్ పరిశీలించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, కాట్పాడి యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్ మురుగన్, ఉపాధ్యక్షుడు శరవణన్, పలువురు ఉన్నతాధికారులు కూడా వున్నారు.

సమాచార దర్శిని

యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 12: యోగా వైద్య కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఈ నెల 22వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. భారత వైద్యం, హోమియో శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 960 సీట్లున్నాయి.ఐదేళ్ల బీఎన్‌వైఎస్ అనే యోగా, ప్రకృతి వైద్యం కోర్సుల అడ్మిషన్లు జూన్ 23న ప్రారంభమయ్యాయి. ప్లస్ టూ మార్కుల ఆధారంగా జరుగుతున్న అడ్మిషన్లకు www.tnhealth.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

చిత్రలేఖనాలకు ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 12: కళ, సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖనం, శిల్ప కళాకారులను ప్రోత్సహించేలా చిత్రలేఖన సంత పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. చెన్నై, కోయంబత్తూర్‌లో ఈ సంతలు నిర్వహించి అందులో కళాకారులు చిత్రలేఖనాలు, శిల్పాలు ప్రదర్శించి వాటిని విక్రయించనుంది. ఆ ప్రకారం ఎగ్మూర్‌లోని ప్రభుత్వ మ్యూజియం ప్రాంగణంలో ఆగస్టు 2 నుంచి 4వ తేది వరకు ఈ సంత జరుగనుంది. ఇందులో రాష్ట్రానికి చెందిన చిత్రకారులు, శిల్ప కళాకారులను ప్రభుత్వం ఆహ్వానించింది. కళాకారులు తాము గీసిన చిత్రాలు, శిల్పాల పూర్తి వివరాలతో దరఖాస్తులు ఈనెల 23వ తేదిలోపు www.artandculture.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులు తెలిపారు.

ఎలక్ట్రిక్ కార్ల కర్మాగారానికి పర్యావరణ అనుమతులు

పెరంబూర్, జూలై 12: తూత్తుకుడిలో రూ.16,000 కోట్లతో ఎలక్ట్రిక్ కార్ల కర్మాగారం ఏర్పాటుకానుంది. ఇందుకోసం విన్‌ఫాస్ట్ సంస్థ రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. కర్మాగారం ఏర్పాటుకు తూత్తుకుడి సిల్లానత్తం సిప్కాట్ ప్రాంతంలో 408 ఎకరాలు కేటాయించారు. ఈ కర్మాగారానికి ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం నిర్మాణపనులకు తమిళనాడు ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ పర్యావరణ అనుమతులు మంజూరు చేసింది.

50 లక్షల పంట రుణ కార్డుల పంపిణీ లక్ష్యం

ఐసిఎఫ్,జూలై12: ఈ సంవత్సరాంతంలోగా పంట రుణ కార్డులు పొందిన రైతుల సంఖ్య 50 లక్షలకు పెంచాలని వ్యవసాయ శాఖ లక్ష్యం నిర్దేశించింది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జాతీయ, ప్రైవేటు బ్యాంకుల ద్వారా రైతులకు వ్యవసాయ రుణ కార్డులు అందజేస్తున్నారు. వీటి ద్వారా గరిష్టంగా రూ.3 లక్షల వరకు రుణాలు పొందవచ్చు. రెండు శాతం వడ్డీతో 12 నెలల్లో రుణం తిరిగి చెల్లించాలి. ఈ కార్డులు ఐదేళ్ల వర్తిస్తాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు 32 లక్షల మంది రైతులకు ఈ కార్డులు అందజేయగా, డిసెంబరు 31వ తేదిలోగా 50 లక్షల మందికి కార్డులు అందించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 12: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు తెలిపింది. ఆయా ప్రాంతాల వివరాలు... అన్నాసాలై పరిధిలోని వైట్ రోడ్డు, ఐసీఐసీఐ బ్యాంక్, అన్నాసాలై, ఐటీసీ హోటల్, వాసన్ అవెన్యూ, రహేజా టవర్, జీపీ రోడ్డు, సత్యమూర్తి భవన్, ఈబీ లింక్ రోడ్డు, క్లబ్ హౌస్ రోడ్డు, సిటీ టవర్, బటుల్లాస్ రోడ్డు ఉన్నాయి. అదే విధంగా ఎక్స్‌ప్రెస్ అవెన్యూ, ఆర్ట్స్ కళాశాల, బిన్నీ రోడ్డు, వీసీ రోడ్డు, హోటల్ కాంచీ, డీఎల్ఎఫ్ ఏరియా, ఇండియన్ బ్యాంక్ బాగన్ బిల్డింగ్, ఎతిరాజ్ కళాశాల, శక్తి టవర్స్, సిటీ బ్యాంక్, మధుర బ్యాంక్, ఐఓబీ, రాణి మెయ్యమ్మ విడిది, కల్యాణ మండపం, ఎయిర్ ఇండియా, అపోలో ఆస్పత్రి, మార్షల్ రోడ్డు, మాండియత్ రోడ్డు, కెనరా బ్యాంక్, కనిమర హోటల్, డేటా సెంటర్, తాజ్ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

4,841 గృహాల్లో సౌరశక్తి విద్యుత్ పథకం

ఐసిఎఫ్, జూలై 12: రాష్ట్రంలో 4,841 గృహాల్లో సౌరశక్తి విద్యుత్ పథకం అమలుపరిచినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కోటి గృహాల పైకప్పులపై సోలార్ ప్యానళ్ల పథకం రూపొందించింది. గత ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకంలో కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రూ.30,000, రెండు కిలో వాట్లకు రూ.60,000, అంతకన్నా ఎక్కువగా ఉన్న కిలో వాట్లకు రూ.78,000 సబ్సిడీ ఇస్తున్నారు. ఈ పథకంలో సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు ఇప్పటివరకు 40,000 మందికి పైగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 30వ తేది వరకు రాష్ట్రంలో 4,841 గృహాల్లో 1,2,3 కిలోవాట్లు సామర్థ్యం కలిగిన ప్యానళ్లు ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు.

ఉత్తమ గ్రంథాలకు రూ.50 వేల బహుమతి

ఐసిఎఫ్, జూలై 12: తమిళాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ గ్రంథ బహుమతి రూ.30 వేల నుంచి రూ.50 వేలకు పెంచినట్లు ఆ శాఖ మంత్రి స్వామినాథన్ తెలిపారు. ప్రతి ఏటా 33 శీర్షికల్లో విడుదలయ్యే ఉత్తమ గ్రంథాలు ఎంపిక చేసి రచయిత, పబ్లిషర్లకు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ గ్రంథానికి రూ.50 వేలు అందజేయనున్నట్లు మంత్రి స్వామినాథన్ తెలిపారు.

పాస్‌పోర్ట్ కార్యాలయంలో 'మే ఐ హెల్ప్ యూ' సౌకర్యం

పెరంబూర్, జూలై 12: స్థానిక అన్నాసాలైలో ఖాయిదేమిల్లత్ పాఠశాల సమీపంలో ఉన్న మండల పాస్‌పోర్ట్ కార్యాలయంలో 'మే ఐ హెల్ప్ యూ' అనే సౌకర్యం ఏర్పాటైంది. ఈ కార్యాలయంలో, ప్రజలు పాస్‌పోర్ట్ పొందేందుకు మార్గదర్శకాలు, దరఖాస్తు పూర్తిచేసే విధానం, అవసరమైన పత్రాలు, కార్యాలయానికి హాజరుకావాల్సిన సమయం తదితరాపై ప్రజలు తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. ప్రజలు 044-28513639/28513640 అనే నెంబర్లకు సంప్రదించవచ్చు. అలాగే, తమ సందేహాలను 917305330666 అనే వాట్సప్ నెంబరుకు పంపించాలి. ఈ సేవలు అన్ని పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పొందవచ్చు. ఈ విషయమై మండల పాస్‌పోర్ట్ అధికారి ఎస్.గోవేందన్ మాట్లాడుతూ... పాస్‌పోర్ట్ విధానాలు సరళీకృతం చేయడంతో, పాస్‌పోర్ట్ దరఖాస్తును అభ్యర్థులే పూర్తి చేసుకోవచ్చన్నారు. పాస్‌పోర్ట్ దరఖాస్తులను https://www.passportindia.gov.in అనే అధికారిక వెబ్‌సైట్, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖలోని బీఎస్పీ విభాగం 'mPassport Seva' అనే యాప్ ద్వారా కూడా సమర్పించాలని కోరారు. దరఖాస్తుదారులు తమ వ్యక్తిగత వివరాలు, రహస్య సమాచారాన్ని మధ్యవర్తులు, ఏజెంట్లకు తెలుపరాదన్నారు. ఈ 'మే ఐ హెల్ప్ యూ' ద్వారా ప్రజలు తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని, ఈ విధానం ద్వారా మధ్యవర్తులు, ఏజెంట్ల ఉచ్చులో చిక్కకుండా ఉండేందుకు దోహదపడుతుందని ఆయన తెలిపారు.

ఎస్‌ఐ నుంచి డీఎస్పీ వరకు తుపాకీ తప్పనిసరి

● లా అండ్ ఆర్డర్ ఏడీజీపీ సూచన



సమావేశంలో ప్రసంగిస్తున్న ఏడీజీపీ దేవాశీర్వాదం

పెరంబూర్, జూలై 12: రాష్ట్రంలో ఎస్‌ఐ నుంచి డీఎస్పీ వరకు పోలీసుల అధికారులు రివాల్వర్ వెంట తీసుకెళ్లాలని శాంతిభద్రతల విభాగ అదనపు డీజీపీ డేవిడ్‌సన్ దేవాశీర్వాదం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, పోలీసు చేతుల్లో లాఠీ తప్పక ఉండాలని సూచించారు. నగరంలో కొద్దిరోజుల క్రితం బీఎస్పీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య జరిగింది. ఈ ఘటనతో రాష్ట్రంలో శాంతి భద్రతలు ప్రశ్నార్థకరంగా మారాయని ఆరోపణలు తలెత్తాయి. ఈ ఘటన అనంతరం ఒకరి తర్వాత ఒకరుగా పోలీసు అధికారుల బదిలీలు జరిగాయి. లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీగా నియమితులూన డేవిడ్‌సన్ దేవాశీర్వాదం గురువారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు తిరువణ్ణామలైలో వేలూరు రీజియన్ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. సమావేశంలో ఎస్పీలు మణివన్నన్ (వేలూరు), డా.కార్తికేయన్ (తిరువణ్ణామలై), ఆల్బర్ట్ జాన్ (తిరుపత్తూర్), కిరణ్‌శృతి (రాణిపేట), ఏఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు. ఈ సమావేశంపై పోలీసు ఉన్నతాధికారులు మాట్లాడుతూ..... "పోలీసులు లాఠీలు ఎందుకు మర్చిపోతున్నారు? అధికారులు తుపాకులు ఎందుకు దగ్గర ఉంచుకోవడం లేదు? ఇకపై, లాఠీలు, తుపాకులు తప్పకుండా ఉంచుకోవాలి. అదే సమయంలో లాఠీలు ఉపయోగించే విధానంపై శిక్షణ ఇవ్వాలి. ఎస్‌ఐలు తమ పరిధిలోని ప్రజలు మెచ్చుకొనేలా పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో 800 మంది డీఎస్పీలుండగా, వారిలో 250 మంది సబ్ లైన్లలో పనిచేస్తున్నారు. పనితీరు సరిగా లేకుండా రొటేషన్ పద్ధతిలో బదిలీ చేస్తారు. ఇక నుంచి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జి ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో), ఇన్స్‌పెక్టర్లు, డీఎస్పీల పనితీరు బట్టి గ్రేడింగ్ చేసి బదిలీ చేస్తామన్నారు. హత్యకేసుల్లో నిజమైన నేరస్తులను మాత్రమే అరెస్ట్ చేయాలి. రాజకీయ ఫిర్యాదులపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేయండి. ఎందుకు అరెస్ట్ చేశారు అని అడిగితే సమాధానం చెప్పండి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గవద్దు. పోలీసులే ప్రాథమిక పనులు చేయాల్సి ఉంది. ఫిర్యాదులపై ఎస్‌ఐలు, సీఐలు, డీఎస్పీలు సక్రమంగా విచారణ జరపాలని లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ డేవిడ్‌సన్ దేవాశీర్వాదం సమావేశంలో సూచించారని అధికారులు తెలిపారు.

రోడ్ల పక్కన పానీపూరీ దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి



పెరంబూర్, జూలై 12: నగరంలోని రోడ్ల పక్కన పానీ పూరీ దుకాణాలు అధికమవుతున్నాయి. రద్దీగా ఉండే ప్రాంతా ల్లో తోపుడు బండ్లు, సైకిళ్లపై ఉత్తరాది వాసులు పానీ పూరీ విక్రయిస్తున్నారు. పెట్టుబడి తక్కువగా ఉండే ఈ వృత్తిపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. అదే సమయంలో పానీ పూరీ ఇష్టపడే వారి సంఖ్య కూడా రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, పానీ పూరీ విక్రయాలు క్రమబద్ధీకరించి, పరిశుభ్రంగా ఉండేలా ఆహార భద్రత శాఖ కొత్త మార్గదర్శకాలు రూపొందించింది. రోడ్ల పక్కన ఉన్న పానీ పూరీ దుకాణాలు తప్పకుండా లైసెన్స్ పొందాలని ఆహార భద్రత శాఖ తెలిపింది. ఏడాదికి లైసెన్స్ రుసుముగా రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. నగరంలో గురువారం ఒక్కరోజే ఉత్తరాది వాసులు నిర్వహిస్తున్న పానీ పూరీ విక్రయాలకు 600 లైసెన్స్‌లు మంజూరు చేశారు. ఈ విషయమై ఆహార భద్రతా శాఖ చెన్నై జిల్లా అధికారి సతీష్‌కుమార్ మాట్లాడుతూ... నగరంలోని పలు ప్రాంతాల్లో పానీపూరీ విక్రయాలు జరుగుతున్నాయన్నారు. నగరవ్యాప్తంగా సుమారు 100కు పైగా దుకాణాలు ఉన్నాయన్నారు. పరిశుభ్రతతో కూడిన సరుకులు, కల్తీ నివారించడంపై చర్యలు చేపట్టామని తెలిపారు. పాత నూనె, మిగిలిపోయిన ఆహారం వాడకుండా పరిశుభ్రంగా విక్రయించేలా పానీ పూరీ విక్రయదారులు, తయారీదారులకు కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో అమ్మ హౌస్‌లో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు.

సేవూరులో ప్రభుత్వ ఫొటో ప్రదర్శన



ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థినులు

వేలూరు, జూలై 12: వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని సేవూరులో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే ప్రత్యేక ఫొటో ప్రదర్శన ఏర్పాటైంది. వేలూరు జిల్లా పీఆర్వో ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ప్రదర్శన వారం రోజుల పాటు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి దరఖాస్తుకు అవసరమైన మార్గాలు తదితరాలన్నింటినీ ఈ ప్రదర్శనలో వుంచారు.

దివ్యాంగులకు సహాయాల పంపిణీ



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూలై 12: వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పలువురు వికలాంగులకు సహాయాలు అందజేశారు. ముందుగా సహాయ సంస్థల కోసం అవగాహనా సమావేశం నిర్వహించారు. అనంతరం సహాయాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా రూరల్ డెవలప్‌మెంట్ విభాగ పథక డైరెక్టర్ ఆర్తి, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, వికలాంగుల సంక్షేమ శాఖాధికారి శరవణన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం

ఐసిఎఫ్, జూలై 12: విదేశాల్లో క్యారమ్, ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసింది. అమెరికా కాలిఫోర్నియా నగరంలో నవంబరు 10 నుంచి 17వ తేది వరకు ప్రపంచ క్యారమ్స్ పోటీలు జరుగనున్నాయి. వాటిలో పాల్గొనేందుకు రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు నాగజ్యోతి, కాసిమ, మిత్ర, కోచ్ మరియ ఇరుదయం ఎంపికయ్యారు. వీరి ఖర్చుల కోసం తలా రూ.1.50 లక్షల చెక్కులను తమిళగ ఛాంపియన్స్ ట్రస్ట్ ద్వారా క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి అందజేశారు. అలాగే, ఈ నెల 16 నుంచి 19వ తేది వరకు న్యూజిలాండ్‌లో జరుగనున్న జూనియర్ కామన్‌వెల్త్ ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు జాయిస్ అషితకు రూ.2 లక్షలు మొత్తం రూ.8 లక్షలు అందజేశారు.

ఇన్స్‌పెక్టర్లకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలు అందిస్తున్న దృశ్యం

వేలూరు, జూలై 12: రాణీపేట జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నెలవారీ సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా ఎస్పీ కిరణ్ శృతి నేతృత్వంలో జరిగిన సమావేశంలో పోలీసుల పని తీరు పరిశీలించారు. సేవా తత్పరత, విశేషా ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన 26 మంది సీఐలకు ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

నేడు పాఠశాలలకు సెలవు

పెరంబూర్, జూలై 12: రాష్ట్రవ్యాప్తంగా శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఉపాధ్యాయుల సంఘాల కోరిక మేరకు పాఠశాల విద్యాశాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. శనివారం యథావిధిగా పాఠశాలలు పనిచేస్తున్న నేపథ్యంలో, రెండో శనివారం సందర్భంగా సెలవు ప్రకటించారు. ప్రతినెలా 2వ శనివారం సెలవు రోజుగా ప్రకటించాలని ఉపాధ్యాయుల సంఘాలు రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

రేపు ఎగ్మూర్‌లో ఆగని సర్కార్, జీటీ, చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లు

పెరంబూర్, జూలై 12: స్థానిక చెన్నై బీచ్-ఎగ్మూర్ మధ్య రైలు మార్గంలో మరమ్మతుల కారణంగా పలు రైళ్లు ఆదివారం ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో ఆగవని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.17651 చెంగల్పట్టు-కాచిగూడ ఎక్స్‌ప్రెస్, నెం.17643 చెంగల్పట్టు-కాకినాడ సర్కార్ ఎక్స్‌ప్రెస్, నెం.12615 తాంబరం-న్యూఢిల్లీ జీటీ ఎక్స్‌ప్రెస్, నెం.12759 తాంబరం-హైదరాబాద్ చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆదివారం సబర్బన్ రైళ్ల మార్గంలో నడుపనున్న కారణంగా ఎగ్మూర్ స్టేషన్‌లో ఆగవు. దానికి బదులుగా చెన్నై బీచ్ స్టేషన్లో ఆ రైళ్లు ఆగనున్నాయి.

నేడు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

పెరంబూర్, జూలై 12: టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జరునుంది. ఇందుకోసం నగరంలో 124 కేంద్రాలు సహా రాష్ట్రవ్యాప్తంగా 797 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 2.38 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఓఎంఆర్ విధానంలో తమిళ్, ఆంగ్లంలో ప్రశ్నలుంటాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా, అరగంట ముందుగా అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, హాల్‌టిక్కెట్టుతో పాటు ఆధార్ తదితర ఏదో ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలని టీఎన్‌పీఎస్సీ తెలియజేసింది.

బాల్యవివాహాలపై ఫిర్యాదు చేయండి

పెరంబూర్, జూలై 12: జిల్లాలో బాల్యవివాహాలు జరిపే వారిపై కఠిన చర్యలు చేపడతామని, వాటికి సంబంధించి 1098, 181 నెంబర్లు ఫిర్యాదు చేయవచ్చు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో, 18 ఏళ్లు నిండిన మహిళ, 21 ఏళ్లు నిండిన పురుషుడు వివాహానికి అర్హులని, అంతకంటే తక్కువ వయస్సున్న వారికి చేసే పెళ్లి బాల్యవివాహంగా పరిగణిస్తామన్నారు. అలాంటి వివాహలు చేసేవారికి ఏడేళ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశముందన్నారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు బాల్యవివాహాలపై 18 ఫిర్యాదులందాయని కలెక్టర్ తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణత.... పాఠశాలలకు అభినందన

ఐసిఎఫ్, జూలై 12: పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన 3,949 ప్రైవేటు మెట్రిక్ పాఠశాలలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆగస్టు 4వ తేది అభినందన కార్యక్రమం జరుగనుంది. గత విద్యా సంవత్సరం టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో 2,199 మెట్రిక్యులేషన్ పాఠశాలలు, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో 1,750 మెట్రిక్యులేషన్ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. వివిధ క్రీడా పోటీల్లో ప్రైవేటు పాఠశాలలకు చెందిన 75 మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో, 255 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో, 1,579 మంది రాష్ట్రస్థాయిలో పతకాలు గెలుచుకున్నారు. ఈ క్రమంలో, 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 3,949 ప్రైవేటు మెట్రిక్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను, క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రప్రభుత్వం ఆగస్టు 4వ తేది నెహ్రూ స్టేడియంలో అభినందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రైవేటు పాఠశాలల విభాగం డైరెక్టర్ పళనిస్వామి తెలిపారు.

ఆక్సీలియం కళాశాలలో ఘనంగా పుస్తకావిష్కరణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

వేలూరు, జూలై 12: వేలూరులోని ఆక్సీలియం కళాశాల మహిళా విభాగాన్ని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మహిళా సంక్షేమంపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతిని కళాశాల కార్యదర్శి అరుణ్, కవయిత్రి మేరీ జోస్‌పిన్ రాణి తదితరులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖాధికారి జయశీలి, కళాశాల ప్రిన్సిపాల్ అమలా వలర్మతి తదితరులు కూడా పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు ప్రజాపనుల శాఖకే...!

ఐసిఎఫ్, జూలై 12: ప్రభుత్వ శాఖల భవన నిర్మాణాలను ప్రజాపనుల శాఖ మాత్రమే చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ భవన నిర్మాణపనులకు ప్రజాపనుల శాఖ 12 శాతం రుసుము వసూలుచేస్తుంది. ఈ ఖర్చులు తగ్గించేలా పలు శాఖలు వేర్వేరుగా నిర్మాణపనులు చేపట్టడం గత ప్రభుత్వంలో పెరిగాయి. ప్రజాపనుల శాఖ ద్వారా మాత్రమే ఈ పనులకు అనుమతివ్వాలని 1990లో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జీవో విడుదల చేశారు. ఈ జీవోను ప్రజాపనుల శాఖ మంత్రి వేలు, ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దానిని పరిశీలించిన ముఖ్యమంత్రి, నిర్మాణపనులకు సెంటేజ్ రుసుము 2.5 శాతానికి తగ్గించడంతో పాటు నిర్మాణపనులకు ప్రైవేటు కార్మికులను కూడా నియమించుకోవచ్చని అనుమతి జారీ చేశారు.

తవ్వకాల్లో బయల్పడిన ప్రాచీన ఆభరణాలు



గాజు ఆభరణం

ఐసిఎఫ్, జూలై 12: తిరుప్పూర్ జిల్లా ఉడుమలై సమీపంలోని కొంగల్ నగరంలో పురావస్తు శాఖ తవ్వకాల్లో ప్రాచీన ఆభరణాలు లభించాయి. ఇదివరకే ఇక్కడ గాజు పూసలు, వ్యవసాయ పనిముట్లు, ఇతర వస్తువులు లభించగా, గురువారం చేపట్టిన తవ్వకాల్లో గాజు, మట్టితో తయారుచేసిన వివిధ రకాల పూర్వీకుల ఆభరణాలు లభించాయి.

శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలి

● అన్నామలై డిమాండ్

అడయార్, జూలై 12: రాష్ట్రంలో నానాటికీ శాంతిభద్రతలు క్షీణించిపోతున్నాయని, వీటి పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఆయన ఓ ట్వీట్ చేశారు. గత కొన్ని రోజులుగా మదురై జిల్లాలో వృద్ధులు వరుసగా హత్యకు గురవుతున్నారని, తాజాగా కూడా 70 యేళ్ళ వృద్ధుడిని కూడా హత్య చేశారని ఆయన చెప్పారు. ఈ వరుస హత్యలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించాలని ఇందుకోసం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నేరుగా చెన్నై - మస్కట్ విమానాలు

అడయార్, జూలై 12: చెన్నై - మస్కట్ ప్రాంతాల మధ్య కొత్తగా డైరెక్ట్ విమాన సేవలు అందుబాటులోకి వచ్చాయి. సలామ్ ఎయిర్‌లైన్స్ సంస్థ ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రతి శుక్రవారం, ఆదివారాల్లో ఈ విమాన సర్వీసులను నడుపనుంది. మస్కట్‌లో అర్ధరాత్రి బయలుదేరే విమానం వేకువజామున 4.15 గంటలకు చెన్నై చేరుతుంది. తిరుగు ప్రయాణంలో చెన్నై నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి మస్కట్ వెళ్తుంది. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ విమాన సేవల్లో భాగంగా తొలి రోజున మస్కట్ నుంచి 179 మంది ప్రయాణికులతో విమానం చెన్నై రాగా, చెన్నై నుంచి 142 మంది ప్రయాణికులు మస్కట్ వెళ్ళారు. కాగా, ప్రస్తుతం ఒమన్ ఎయిర్‌లైన్స్ మాత్రమే చెన్నై - మస్కట్ ప్రాంతాల మధ్య డైరెక్ట్ విమాన సర్వీసులను నడుపుతోంది. దీంతో ఈ విమానాలు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ప్రారంభమైన ఈ విమాన సర్వీసుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ తగ్గే అవకాశం ఉందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

50 వేల ఇళ్ల ఆస్తిపన్ను వసూలుకు చర్యలు

● కార్పొరేషన్ అధికారుల దృష్టి

అడయార్, జూలై 12: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో పట్టాలేని ఇళ్ల నుంచి కూడా ఆస్తి పన్ను వసూలు చేయాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా కొత్తగా 50 వేల ఇళ్లను ఆస్తిపన్ను పరిధిలోకి తీసుకురానున్నారు. చెన్నై నగర వ్యాప్తంగా పోరంబోకు స్థలాల్లో ఎలాంటి అనుమతి లేకుండా 50 వేలకు పైగా ఇళ్లు నిర్మించినట్టు కార్పొరేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. వాటి యజమానుల నుంచి ఆస్తి పన్ను వసూలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇదే విషయంపై చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.రాధాకృష్ణన్, జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించాలని భావిస్తున్నారు. ఇందులోభాగంగా తొలి దశలో 20 వేల ఇళ్లకు ఆస్తి పన్ను విలువ నిర్ధారించే చర్యలు ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారు. ముఖ్యంగా పట్టాలు, ఎలాంటి అనుమతులు లేకుండా టి.నగర్, ఆలందూరు, మణలి, మాధవరం ప్రాంతాల్లో అధిక సంఖ్యలో గృహాలను నిర్మించినట్టు నగర పాలక సంస్థ అధికారులు గుర్తించారు.

నకిలీ పత్రాలు అడ్డుకొనేందుకు చర్యలు

ఐసిఎఫ్, జూలై 12: రిజిస్ట్రేషన్ సమయంలో నకిలీ దస్తావేజులు సమర్పించడాన్ని అడ్డుకొనేలా రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు చేపట్టింది. కొంతమంది నకిలీ దస్తావేజులతో రిజిస్ట్రేషన్ చేసి స్థలాలు ఆక్రమిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో, స్పందించిన రిజిస్ట్రేషన్ శాఖ భూ సర్వే మ్యాప్‌ను సబ్ రిజిస్ట్రార్లు పరిశీలించి రిజిస్ట్రేషన్ చేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

అయోధ్య వెళ్లేందుకు నకిలీ విమాన టిక్కెట్లు

● 106 మందిని అడ్డుకున్న అధికారులు

పెరంబూర్, జూలై 12: మదురై నుంచి అయోధ్యకు తీసుకెళ్తామని చెప్పి 106 మందికి నకిలీ విమాన టిక్కెట్లు అందజేసిన ఘటన కలకలం రేపింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో నిర్మించిన రాముడి ఆలయం గత ఏడాది ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్రం నుంచి భక్తులు అయోధ్యకు వెళ్లేలా చెన్నై, సేలం, మదురై సహా పలు నగరాల నుంచి ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉన్నాయి. చెన్నై నుంచి అయోధ్యకు విమాన సేవలు కూడా ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యంలో, మదురై నుంచి అయోధ్యకు విమానంలో తీసుకెళ్తామని కొంతమంది ప్రజల నుండి డబ్బులు వసూలుచేశారు. ఆ మోసగాళ్లు, ఇండిగో విమాన టిక్కెట్లు వారికిచ్చారు. దీంతో, అయోధ్యకు వెళ్లేందుకు 106 మంది శుక్రవారం ఉదయం ఆ టిక్కెట్లతో మదురై విమానాశ్రయానికి చేరుకున్నారు. టిక్కెట్లు పరిశీలించిన అధికారులు, అవి నకిలీవిగా నిర్ధారించి వారిని అడ్డుకున్నారు. అదే సమయంలో అయోధ్యకు వెళ్లేందుకు తమ వద్ద ముందస్తు రిజర్వేషన్ చేసుకోలేదని ఇండిగో సంస్థ తెలియజేసింది. దీంతో, లబోదిబోమన్న బాధితులు ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన తహసీల్దార్

ప్యారీస్, జూలై 12: నీలగిరి జిల్లా గూడలూరులో భూ సర్వేకు రూ.20 వేలు లంచం తీసుకుంటున్న మహిళా తహసీల్దార్‌ను ఏసీబీ అరెస్ట్ చేసింది. గూడలూరు మున్సిపాలిటీ పరిధిలోని తొట్టముల్ల ప్రాంతంలో నివసిస్తున్న ఉమ్ము సల్మ తల్లిదండ్రులు, సోదరులు మరణించారు. వారి పేర్లతో ఉన్న భూముల్లో తనవాటా కింద ఉన్న 42సెంట్లు తన పేరుమీద మార్చుకోవాలని నిర్ణయించారు. భూముల పంపకంలో ఏర్పడిన విభేధాల కారణంగా సల్మ హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం సల్మకు మద్దతుగా తీర్పునిచ్చింది. 42 సెంట్ల భూమిని తన పేరుమీద మార్చాలని కోరుతూ సల్మ గూడలూరు తహసీల్దార్ రాజేశ్వరిని కలిసి దరఖాస్తు సమర్పించారు.ఇందుకు ఆమె రూ.2లక్షలు డిమాండ్ చేసింది. దీంతో సల్మ ఊటీలో ఉన్న అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించారు.వారి సూచనల మేరకు రసాయనం పూసిన రూ.20 వేలు గురువారం రాత్రి సల్మ తహసీల్దార్ రాజేశ్వరికి అందిస్తుండగా ఏబీసీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

సెంట్రల్ స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, జూలై 12: సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించిన ఆర్పీఎఫ్ అధికారులు, 8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని ఒడిసాకు చెందిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఆంధ్ర రాష్ట్రం విజయవాడ నుంచి పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన ప్రయాణికుల లగేజీని రైల్వే పోలీసులు తనిఖీ చేశారు. ఆ సమయంలో ఒడిసాకు చెందిన జిహాసియామిషల్, బీనువల్‌పాయక్ బ్యాగులు తనిఖీ చేసి అందులో గంజాయిని గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని 8 కిలోల గంజాయి పొట్లాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించగా ఆంధ్ర రాష్ట్రం నుంచి రైళ్ల ద్వారా అక్రమంగా గంజాయి తీసుకువచ్చి నగరంలో భవన నిర్మాణ కార్మికులు, బరువులు మోసే కార్మికులకు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

రైళ్లలో పోగొట్టుకున్న 19 సవర్లు అప్పగింత

ప్యారీస్, జూలై 12: నాగర్‌కోయిల్-ముంబై ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ మహిళ పోగొట్టుకున్న 19 సవర్ల నగలను రైల్వే పోలీసులు ఆమెకు అప్పగించారు. ముంబై నుంచి నాగర్‌కోయిల్ వెళ్లే ముంబై ఎక్స్‌ప్రెస్ గురువారం ఉదయం 9.45 గంటలకు నాగర్‌కోయిల్ రైల్వేస్టేషన్ చేరుకుంది. ప్రయాణికులంతా దిగివెళ్లాక రైల్వే పోలీసులు ఖాళీ బోగీలను తనిఖీ చేస్తుండగా, ఏసీ బోగీలో సీటు కింద ఉన్న ఓ బ్యాగుని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ మాధవన్ కుట్టి బ్యాగు పరిశీలించి, అందులో 19.5 సవర్ల బంగారం, 3 సవర్ల వెండి నగలతో పాటు ఓ మహిళ ఆధార్ కార్డు నకలు ఉండడం గమనించారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు, ఆధార్ కార్డు ఆధారంగా వెస్ట్ ముంబై అంధేరి ప్రాంతానికి చెందిన మాణిక్యం భార్య కార్తీక (28) అని తెలిసింది. వారిని శుక్రవారం ఉదయం నాగర్‌కోయిల్ పోలీస్‌స్టేషన్‌కు రప్పించి పోగొట్టుకున్న నగలను అప్పగించారు. నగలు అందుకున్న కార్తీక పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పు తీర్చమన్నందుకు యువకుడి హత్య

● ఇద్దరు విద్యార్థుల అరెస్టు

అడయార్, జూలై 12: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమని అడిగారనే కోపంతో ఇద్దరు కాలేజీ విద్యార్థులు తన స్నేహితుడిని కిడ్నాప్ చేసి అతి కిరాతకంగా హత్య చేసి శవాన్ని వాలాజాబాద్ సమీపంలో పాలారు ఇసుకలో పాతిపెట్టారు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు, కాంచీపురం జిల్లా వాలాజాబాద్ సమీప గ్రామానాకి చెందిన రుద్రకోటి, ప్రియ దంపతుల కుమారుడు ధనుష్ (21) బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతూ, టీఎన్‌పీఎస్సీకి సిద్ధమవుతున్నాడు. ధనుష్ స్నేహితులు విశ్వ, సుందర్ చెన్నై పచ్చయప్పా కాలేజీలో చదువుతున్నారు. ఈ క్రమంలో ఖరీదైన బైక్ కొనుగోలు చేసేందుకు, ఇంటికి మరమతులు చేయించుకునేందుకు ధనుష్ తల్లిదండ్రుల వద్ద విశ్వ రూ.10 లక్షల వరకు డబ్బు అప్పుగా తీసుకున్నాడు. ఈ డబ్బులను వడ్డీతో సహా చెల్లించాలంటూ ధనుష్ అడిగేవాడు. దీంతో విశ్వ తన స్నేహితుడు సుందర్‌తో కలిసి గత శనివారం రాత్రి ధనుష్‌ను కిడ్నాప్ చేశాడు. వాలాజాబాద్‌లోని పాలారు వద్దకు తీసుకెళ్ళి కిరాతకంగా హత్య చేసి శవాన్ని ఇసుకలో పాతిపెట్టారు. మరుసటి రోజు ధనుష్ హత్యకు గురైన విషయాన్ని స్థానికులు గుర్తించి వాలాజాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. పాలారులో గాలించగా, ధనుష్ మృతదేహాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్యపై కేసు నమోదు చేసి జరిపిన విచారణలో శనివారం రాత్రి ధనుష్ ఓ కారులో వెళ్ళినట్టు సీసీ ఫుటేజీలో గురించారు. ఆ తర్వాత కారు నంబరు ఆధారంగా కూపీ లాగగా అది విశ్వదిగా తేలింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం వెల్లడైంది. అప్పుగా తీసుకున్న డబ్బు ఇవ్వాలంటూ ఒత్తిడి చేయడంత స్నేహితుడు సుందర్‌తో కలిసి హత్య చేసినట్టు నేరాన్ని అంగీకరించారు. దీంతో వారిద్దరిని అరెస్టు చేశారు.

సిగ్నల్ లోపంతో నిలిచిన సబర్బన్ రైళ్లు

పెరంబూర్, జూలై 12: సిగ్నల్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా శుక్రవారం తిరువళ్లూర్, అరక్కోణం నుంచి చెన్నై సెంట్రల్‌కు వచ్చే సబర్బన్ రైళ్లు మధ్యలో నిలిచిపోయాయి. ఉదయం వేళ కావడంతో కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే వారు శివారు ప్రాంతాల నుంచి నగరానికి చేరుకుంటుంటారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం తిరువళ్లూర్, అరక్కోణం నుంచి వెళ్లే సబర్బన్ రైళ్లు బేసిన్ బ్రిడ్జి దాటి యార్డ్ సమీపంలోకి వస్తున్న సమయంలో సిగ్నల్‌లో సాంకేతికలోపం తలెత్తడంతో అక్కడే ఆగిపోయాయి. అరగంట దాటినా సిగ్నల్ రాకపోవడంతో ప్రయాణికులు రైలు పట్టాలగుండా నడుచుకుంటూ సెంట్రల్ రైల్వేస్టేషన్, మూర్ మార్కెట్, ఎలిఫెంట్ గేట్ తదితర ప్రాంతాలకు చేరుకున్నారు.

లేళ్లపల్లి రమేష్-శ్రీదేవిలకు 'ఉత్తమ దంపతుల' పురస్కారం



రమేష్ శ్రీదేవి దంపతులకు పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ ఐఐటీలో బోధన చేస్తూ సరస్వతి 72 మేళకర్త సంగీత చక్రం రూపొందించి.. సంగీత సరస్వతికి సేవలందిస్తున్న లేళ్లపల్లి శేషాచల రమేష్, తెలుగు భాషా సేవకురాలైన ఆయన సతీమణి లేళ్లపల్లి శ్రీదేవి దంపతులను 'ఉత్తమ దంపతుల' పురస్కారం వరించింది. ఇటీవల ఏలూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 'భోగరాజు సూర్యప్రభ సత్యనారాయణ ఉత్తమ దంపతుల' పురస్కారం ప్రదానం చేశారు. సూర్యప్రభ ఎంటర్‌ప్రైజెస్, జీకే డిజిటల్ న్యూస్ ద్వారా సేవలందిస్తున్న భోగరాజు సూర్యప్రభ సత్యనారాయణ తమ 57వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని, నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే బి.రాధాకృష్ణ తదితరులు హాజరయ్యారు.

యోగాతో ఆరోగ్యం ఆనందం

వేళచ్చేరి

యోగా శాస్త్రాలు రచించి, వాటి ప్రాముఖ్యతను మన రుషులు ఏనాడో తెలియ జెప్పినా, కొద్ది కాలం క్రితం వరకు అది కొంత మంది వరకే పరిమితమయింది. తర్వాత రోజుల్లో యోగా గురువులు దాని ప్రాముఖ్యతపై ప్రచార మాధ్యమాల్లో వివరించడం, ప్రత్యక్షంగా చూపించడంతో ఎందరో యోగ శిక్షణ పొంది రుగ్మతలను తగ్గించుకుంటున్నారు. లింగ వివక్షత, వయసుతో నిమిత్తం లేకుండా అందరూ యోగా చేయవచ్చు. అందుకే ఎంతోమంది మహిళలు కూడా వయోభేదం లేకుండా యోగ శిక్షణ కార్యక్రమాల్లో పాలుపంచుకొంటున్నారు. మరెంతో మంది యోగా గురువులుగా శిక్షణ ఇస్తున్నారు. అలాంటి వారిలో ఒకరు లలితా శ్రీహరి. ఆమె ఎంతోమందికి యోగా శిక్షణఇస్తున్నారు. ఆమె యోగ జీవనప్రస్థానం నేటి 'తరుణి'లో...


లలిత




యోగాసనాల్లో

● శిక్షకురాలు లలితా శ్రీహరి

లలిత జన్మించింది చెన్నైలో. తల్లి హేమావతి. తండ్రి వినాయగం.తెలుగు కుటుంబమే అయినా కొన్ని తరాలుగా తమిళనాడు సరిహద్దుల్లో ఉండడం వలన వీరి తెలుగు భాషపై తమిళ ప్రభావం కనబడుతుంది. లలిత తల్లిదండ్రులు చెన్నైలోనే స్థిరపడ్డారు. ఈమెకు ఒక సోదరుడు, ఒక సోదరి ఉన్నారు. లలిత పాఠశాల విద్యాభ్యాసం సెయింట్ ఏనీస్‌లో, క్వీన్ మేరీస్ కళాశాలలో బీఎస్సీ చదివారు. తర్వాత పచ్చయప్పా కాలేజీ నుంచి ఎమ్ఎస్సీ పీజీ డిగ్రీ అందుకున్నారు.

యోగాపై ఆసక్తి : లలితకు బాల్యం నుండే యోగాపై ఆసక్తి కలిగింది. కుటుంబంలో ఎవరూ యోగా చేయకపోయినా, తను మాత్రం ప్రతి ఆదివారం యోగ శిక్షణా కేంద్రానికి వెళ్లి యోగాభ్యాసం చేసేది. అయితే చదువు, వివాహం, పిల్లలు, విదేశీ యానం.... కారణాలతో యోగాకి కొంత విరామం ఇచ్చింది. తిరిగి చెన్నై వచ్చి స్థిరపడిన తరువాత ఇంటికి సమీపంలోని స్కై యోగా సెంటర్‌లో చేరి యోగాలో ప్రాథమిక శిక్షణ పొందారు.


ఆన్‌లైన్‌తో యోగా తరగుతులు నిర్వహిస్తూ....


భర్తతో కలసి యోగాసనం...

కుటుంబం నేపథ్యం...

లలిత భర్త శ్రీహరి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యోగా పట్ల అమితమైన ఆసక్తి. దంపతులిద్దరూ కలసి యోగా చేయడం విశేషం. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు.



జీవన ప్రస్థానంలో యోగా...

ఇంట్లో కూడా నిత్యం యోగా సాధన చేస్తూ దాని మీద మరింత ఆసక్తి పెంచుకున్నారు లలిత. మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి యోగా ప్రధానాంశంగా ఎమ్‌ఏ డిగ్రీ పొందారు. స్కై యోగా సెంటర్‌లోనే ఏడేళ్ల పాటు ఉచితంగా యోగా తరగతులను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ స్కై

తరుణి

యోగా ట్రస్ట్ ద్వారా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు రెండేళ్ల పాటు శిక్షణ ఇచ్చారు. వేళచ్చేరిలోని చెన్నై సిల్క్స్‌లో పనిచేసే 300 మంది ఉద్యోగులకు 2 వారాల పాటు లలిత శిక్షణ ఇచ్చారు. లలిత భర్త కూడా యోగా పట్ల అభిరుచి కలిగి ఉండడం, ఇద్దరు కలసి సాధాన చేయడం, ఆమె యోగాభ్యాసానికి ప్రోత్సాహాన్నిచ్చాయి. అంతేకాదు, భర్త పని చేసే టీసీఎస్ కంపెనీ సహకారంతో ఆయుష్ మంత్రిత్వ శాఖ నిర్వహించే యోగా కోర్సులు లెవెల్-1, లెవెల్-2 కూడా దంపతులిద్దరూ పూర్తిచేయడం మరింత ప్రత్యేకం. అంతేకాకుండా టీసీఎస్ ప్రోత్సాహంతో ఇరువురు ఎమ్ఎస్సీ యోగా థెరపీలో కూడా ఉత్తీర్ణులయ్యారు.

లలిత ప్రస్తుతం ఆన్‌లైన్లో యోగా తరగతులను నిర్వహిస్తున్నారు. థెరపిటిక్ యోగా ఆమె ప్రత్యేకత. ఎంతో మంది ఆమె వద్ద నేర్చుకున్న యోగాభ్యాసంతో ఒత్తిడిని అధిగమించారు. ఫ్రోజెన్ షోల్డర్, మెడ నొప్పులు మొదలైన వాటి నుంచి ఉపశమనం పొందారు. మధుమేహం, రక్తపోటు వగైరా జీవనశైలి రుగ్మతల నుంచి కూడా స్వాంతన కలిగించారు లలిత. అయితే యోగాభ్యాసం చేస్తూ జీవన శైలి, ఆహారపుటలవాట్లు మార్చుకున్నప్పుడే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆమె అభిప్రాయం.

లలిత మెడిటేషన్, ప్రాణాయామం తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు మరెన్నో శారీరక ప్రయోజనాలు కూడా అందిపుచ్చుకోవాలని లలిత తెలిపారు. యోగాకు సంబంధించిన పుస్తకాలు చదవడం, పాటలు వినడం, ఆధ్యాత్మిక బాటలో నడవడం లలితకు ఇష్టమయిన విషయాలు...

"శారీరక, మానసిక ఆరోగ్యాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. నిత్యం క్రమశిక్షణతో యోగాభ్యాసం, ప్రాణాయామం చేసినట్లయితే తప్పకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం గావించుకోవచ్చు. యోగాభ్యాసంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అందరూ ఆరోగ్యంగా జీవించాలన్నది కోరిక. అందుకు నా శాయశక్తులా కృషిచేస్తాను". అని లలిత తరుణితో తన అనుభవాలు పంచుకున్నారు.

వృద్ధ కళాకారులకు యోగిబాబు చిరు సాయం

తమిళ చిత్రపరిశ్రమలోని వృద్ధ కళాకారులకు ఆదుకునేందుకు పలువురు సినీ నటులు తమవంతు సాయం చేస్తుంటారు. ఈ కోవలోనే తాజాగా ప్రముఖ హాస్య నటుడు, హీరో యోగిబాబు తన వంతుగా రూ.6 లక్షల ఆర్థిక సాయం చేశారు. నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్‌కు యోగిబాబు శుక్రవారం చెక్కు అందజేశారు. నడిగర్ సంఘంలో సభ్యత్వం కలిగిన వృద్ధ కళాకారులను ఆదుకునేందుకు ఈ నిధులను వినియోగించాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని నడిగర్ సంఘం శుక్రవారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో పేర్కొంది.


పూచ్చి మురుగన్‌కు చెక్కు అందజేస్తున్న యోగిబాబు

చిత్రజ్యోతి

భరత్ హీరోగా 'కాళిదాస్-2' ప్రారంభం


తొలి క్లాప్ కొడుతున్న శివకార్తికేయన్

2019లో శ్రీ సెందిల్ దర్శకత్వంలో భరత్ హీరోగా నటించిన చిత్రం 'కాళిదాస్'. ఈ చిత్రం రెండో భాగం రూపుదిద్దుకుంటోంది. సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. హీరో శివకార్తికేయన్ పాల్గొని తొలి క్లాప్ కొట్టి, చిత్ర యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో సెవెన్ స్క్రీన్ స్టూడియో అధినేత, బడా నిర్మాత ఎస్ఎస్ లలిత్ కుమార్, అమ్మ క్రియేషన్స్ టి.శివ, ఫైవ్‌స్టార్ క్రియేషన్స్ కదిరేశన్, శాంతి టాకీస్ అరుణ్ విశ్వ, ఒలింపియా మూవీస్ ఎస్.అంబేత్ కుమార్, ప్రముఖ సినీ పంపిణీదారుడు అళగర్‌స్వామి, ఆరుద్ర ఫిలిమ్స్ అరవింద్, దర్శకుడు కె.కళ్యాణ్, డార్క్ మూవీ ఫేం జగన్, సినిమాటోగ్రాఫర్ బాలసుబ్రహ్మణ్యం, వేల్‌రాజ్ తదితరులు హాజరై చిత్ర బృందాన్ని అభినందించారు. 'కాళిదాస్-2'లో భరత్, అజయ్ కార్తీ నటిస్తుండగా శ్యామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభించనుండగా, ఇతర నటీనటుల వివరాలను అధికారికంగా వెల్లడించాల్సివుంది.

చరణ్ హీరోగా 'ఇవన్ తంతిరన్'


'ఇవన్ తంతిరన్'లో చరణ్, తంబి రామయ్య, రెడిన్ కింగ్‌స్లే

మసాలా పిక్చర్స్ బ్యానరుపై తెరకెక్కుతున్న 'ఇవన్ తంతిరన్' చిత్రంలో చరణ్ హీరోగా నటిస్తున్నారు. 'నీదానే ఎన్ పొన్‌వసంతం', సింగం-2' వంటి పలు చిత్రాల్లో నటించిన చరణ్... 'వడచెన్నై', 'కేజీఎఫ్-2' వంటి చిత్రాల్లో అద్భుత నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇపుడు 'ఇవన్ తంతిరన్' చిత్రంలో హీరోగా నటిస్తుండగా, తంబిరామయ్య, రెడిన్ కింగ్‌స్లీను ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఆర్.కన్నన్ దర్శకుడు. గతంలో వచ్చిన ఈ చిత్రానికి ఇది సీక్వెల్. శుక్రవారం పూజా కార్యక్రమంతో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. థమన్ సంగీతం. కాగా, ప్రముఖ దర్శకుడు మణిరత్నం వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన ఆర్.కన్నన్'జయం కొండన్' అనే చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత అనేక విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఇపుడు 'ఇవన్ తంతిరన్' సినిమా విడుదలైన ఏడేళ్ళ తర్వాత రెండో భాగాన్ని రూపొందిస్తున్నారు.


శంకర్ దర్శకత్వంలో విశ్వ నటుడు కమల్ హాసన్ నటించిన 'ఇండియన్-2' చిత్రం శక్రవారం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాగా, దీన్ని పురస్కరించుకుని చెన్నై, రాయపేటలోని సత్యం థియేటర్ కాంప్లెక్స్ వద్ద కట్టిన బ్యానర్‌కు హారతిస్తున్న వీరాభిమానులు

హన్సిక ద్విపాత్రాభినయంలో 'గాంధారి'

● ట్రైలర్ రిలీజ్ చేసిన మణిరత్నం


'గాంధారి' ట్రైలర్ రిలీజ్ దృశ్యం

ఆర్.కన్నన్ దర్శకత్వంలో హీరోయిన్ హన్సిక ద్విపాత్రాభినయం చేసిన 'గాంధారి' చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు మణిరత్నం రిలీజ్ చేశారు. మెట్రో శిరీష్ ముఖ్య పాత్ర పోషించిన ఈ చిత్రానికి ఎల్‌వీ ముత్తు గణేష్ సంగీతం సమకూర్చారు. నిర్మాత ధనుంజయన్ ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే అందించడం గమనార్హం. ఎమోషనల్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందించిన ఈ చిత్రం ట్రైలర్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోంది. ఈ ట్రైలర్ ప్రారంభంలో 'గంధర్వకోట' పేరుతో ఓ భారీ భవాన్ని చూపించారు. ఇందులో 'అరుంధతి' నుంచి అనుష్క పేరు రీక్రియేట్ చేయగా, ఈ భవనంలో కొన్ని అవాంఛనీయ సంఘటనలు జరుగుతుండగా, మధ్యలో హన్సిక పాత్రను భయపెట్టే విధంగా చూపించాను. ఆ తర్వాత ఫ్లాష్ బ్యాక్ కథ కొనసాగుతుంది. ఈ ట్రైలర్ కట్ చేసిన విధానంలో కొత్తదనం కనిపించకపోయినప్పటికీ... హన్సిక మాత్రం ప్రేక్షకులను భయపెట్టేలా నటించారు. ట్రైలర్ చివరిలో 'ఇది నా కాపలా స్థలం.. ఎవరికీ అనుమతి లేదు' అని ఒక లైన్ స్టోరీని బహిర్గతం చేశారు.

---

50 ఏళ్ల అసెంబ్లీ సమావేశాలు డిజిటలైజేషన్

● త్వరలో ప్రజల సందర్శనకు అవకాశం



పెరంబూర్, జూలై 12: ప్రభుత్వ శాఖల్లోని రికార్డులు, కార్యకలాపాలు అన్నింటినీ డిజిటల్ విధానానికి మారుస్తున్నారు. ఆ విధంగా, శాసనసభ కార్యకలాపాలు కూడా డిజిటల్ విధానంలోకి మార్చేందుకు చర్యలు చేపట్టారు. ఈ విషయమై అసెంబ్లీ నిర్వహణ అధికారులు మాట్లాడుతూ... శాసనసభలో గత 50 ఏళ్లలో జరిగిన సంఘటనలు, ముఖ్యమైన చర్చలు తదితరాలు ప్రస్తుతం అసెంబ్లీ గ్రంథాలయంలో పుస్తకాల రూపంలో ఉన్నాయన్నారు. వాటిని ప్రజల సందర్శన కోసం వెబ్‌సైట్‌లోకి అప్‌లోడ్ చేసేలా డిజిటలైజేషన్ చేపట్టామన్నారు. అందులో నిర్దిష్టమైన పదం అంటే కరుణానిధి, జయలలిత పేరు ఎంటర్ చేస్తే వారు మాట్లాడిన అన్ని ప్రసంగాలు చూడవచ్చన్నారు. ఇక, కావేరి, కచ్చాదీవి లాంటి ముఖ్యమైన విషయాలపై అసెంబ్లీలో జరిగిన చర్చలు, వాదోపవాదాలు కూడా ప్రజలు వీక్షించవచ్చని తెలిపారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. జాతీయస్థాయి ఈ-విధాన్ వెబ్‌సైట్‌లో అసెంబ్లీ అజెండా, పాలసీ బ్రీఫింగ్ నోట్స్ తదితరాలు కూడా అప్‌లోడ్ చేయనున్నామన్నారు. వీటితో పాటు కరుణానిధి శతజయంతికి సంబంధించి శాసనసభ సచివాలయం రూపొందించిన పుస్తకాన్ని కూడా త్వరలో ప్రచురించబోతున్నట్లు అధికారులు తెలిపారు.

గిండిలో ఇన్నోవా సొల్యూషన్స్ హబ్



చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్ ప్రొవైడర్ 'ఇన్నోవా సొల్యూషన్స్' చెన్నైలో హబ్ ప్రారంభించింది. స్థానిక గిండిలోని ఒలంపియా టెక్ పార్క్‌లో తమ కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా సంస్థ భారత్ హెడ్ ప్రదీప్ యడ్లపాటి మాట్లాడుతూ.. చెన్నైలో తమ కొత్త ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.


చెన్నై పళ్లిక్కరణైలో జయచంద్రన్ స్టోర్ బంగారు, వజ్ర, వెండి ఆభరణాల విభాగాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభిస్తున్న నిర్వాహకులు శరవణ చంద్రన్, జె.సుందరలింగం, మీనా సుందరలింగం, జయ జానకి జయచంద్రన్, ఆర్.సర్గుణ చంద్రన్, వ్యవస్థాపకులు జయచంద్రన్ తదితరులు


ఫ్యామిలీ క్లినిక్ ప్రారంభిస్తున్న ఎంపీ కళానిధి వీరాసామి

కావేరి ఆస్పత్రిలో ఫ్యామిలీ క్లినిక్ ప్రారంభం

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ డాక్టర్లు, ఫ్యామిలీ క్లినిక్‌లు అంతరించిపోతున్న నేటి తరుణంలో కావేరి ఆస్పత్రుల గ్రూప్ ఫ్యామిలీ క్లినిక్‌లను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని ఎంపీ కళానిధి వీరాసామి అన్నారు. వడపళని కావేరి ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం ఆయన ఫ్యామిలీ క్లినిక్‌ను ప్రారంభించి మాట్లాడుతూ పెరంబూరుకు చెందిన డాక్టర్ కళానిధి బాల్యంలో తమకు ఫ్యామిలీ డాక్టర్‌గా ఉండేవారని, ఆయనపైనున్న అభిమానంతో తన తండ్రి ఆర్కాట్ వీరాసామి కళానిధి అని తనకు అతడి పేరుపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావేరి ఆస్పత్రుల గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పూర్ణచంద్రన్, ఫ్యామిలీ క్లినిక్ హెడ్ డాక్టర్ కవిత, డాక్టర్ సుజాత డాక్టర్ వైభవ్, డాక్టర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామచంద్రలో అంతర్జాతీయ సదస్సు


ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని 'శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్'లో వైద్యవిద్యపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. దేశవిదేశాలకు చెందిన నిపుణులైన వైద్య అధ్యాపకులు ఈ సదస్సులో పాల్గొని వైద్యవిద్యలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు వినూత్న విధానాలపై చర్చిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్య, పారా మెడికల్ విద్యార్థులకు సిమ్యులేషన్ లెర్నింగ్ కోసం ఏర్పాటు చేసిన వర్చువల్ రియాలిటీ ల్యాబ్‌ను ఛాన్సలర్ వెంకటాచలం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమా శేఖర్, ప్రొ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ మహేష్ వాకమూడి, మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ కె.బాలాజీ సింగ్, అకడమిక్ కన్వీనర్ డాక్టర్ ఎం.శాంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

ఉపరాష్ట్రపతితో 'ఫిక్కీ ఫ్లో చెన్నై' ప్రతినిధుల భేటి



చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'ఫిక్కీ ఫ్లో చెన్నై' ప్రతినిధులు భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ తో భేటీ అయ్యారు. చెర్‌పర్సన్ దివ్య అభిషేక్ నేతృత్వంలో 30 మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఢిల్లీ వెళ్లి ఉపరాష్ట్రపతితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత, సామాజిక పురోగతిపై పారిశ్రామికవేత్తలు ధన్‌ఖడ్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రతిభావంతులైన యువతులకు చేయూతనివ్వాలని ఫిక్కీ సంస్థకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు సుధా శివకుమార్, కవితా దత్ చిట్టూరి, మాజీ చైర్‌పర్సన్‌లు రాజీ రాజు, శ్రీకాంత్ జావేర్, పర్వీన్ పాప, సీనియర్ వైస్ చైర్‌పర్సన్ నియాతి మెహతా, సంధ్యా రాజన్ తదితరులు పాల్గొన్నారు.


చెన్నై, తిరువాన్మియూర్‌లో ఉన్న పాంబన్ కుమరగురునాధన్ ఆలయంలో 66 ఏళ్ల అనంతరం శుక్రవారం జరిగిన మహాకుంభాభిషేకంలో పాల్గొన్న మంత్రులు, పీకే శేఖర్‌బాబు, టీఎం అన్బరసన్, అధికారులు, వేద పండితులు, భక్తజనం

